
తెలుగులో..



అవగాహన, ప్రతిస్పందన బాగా రాసేందుకు అచ్చు పుస్తకం అవసరం అవుతుంది. పద్య పాఠ్యాంశాల్లో తేటగీతి, ఆట వెలది, కంద పద్యాలను (నీతి గలవి) చూసుకుంటే సరిపోతుంది. జవాబులను సంపూర్ణ వ్యాక్యాలుగా రాయాలి. ప్రశ్నలు తయారు చేసేందుకు ప్రశ్నార్థక పదాలు (ఎవరు, ఎవరికి, ఏమిటి, ఎలా, ఎందుకు) గుర్తుంచుకొని తయారు చేయాలి. పరిచిత గద్యానికి గద్యాంశ పాఠాలు చూసుకోవాలి. సృజనాత్మకతలో పద్య భాగం నుంచి కవి పరిచయాలు, గద్య భాగం నుంచి నేపథ్య ప్రక్రియలు చూసుకుంటే సరిపోతుంది. ప్రశ్నల సంఖ్య సరిగా వేయాలి. విరామ చిహ్నాలు పాటించడంతో పాటు దస్తూరిగా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

– భవానీ శంకర్, తెలుగు ఉపాధ్యాయుడు, నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్

ప్రశ్నను అర్థం చేసుకోవాలి



ప్రశ్నపత్రం ఒకటే అయినప్పటికీ జవాబు పత్రాలు భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం వేర్వేరుగా ఇస్తారు. ఇందులో జీవన విధానాలు (విసర్జన), నియంత్రణ, సమన్వయం, ప్రత్యుత్పత్తి, పటాలను (బొమ్మలు) సాధన చేయాలి. దీంతో పాటు పట్టికలు, పేరాగ్రాఫ్‌ల రూపంలో ఉన్న అంశాలను బాగా చదివి తర్వాత సంబంధిత మాదిరి ప్రశ్నలకు సమాధానం రాయడం సాధన చేయాలి. ప్రయోగాలు, కృత్యాలు, పేరాలు, బేధాలు రాయడం వంటి అంశాలను అవగాహనతోనే అధ్యయనం చేయాలి. ఏదైనా ఒక అంశం గురించి నినాదాలు, ప్రశ్నలు తయారీపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలి.

–పలకా శ్రీదేవి, జీవశాస్త్రం, నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్

అర్థమయ్యేలా రాస్తే అన్ని మార్కులు మీవే..



పాఠ్యపుస్తకాల ఆధారంగా తొలిసారి జరుగుతున్న పరీక్షల్లో జనరల్ సైన్స్ పేపర్ -1 (భౌతిక రసాయన శాస్త్రం) 50 మార్కులకు ఉంటుంది. దీనిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడం తేలిక. బాష్పీభవనం, అశ్వదృష్టి, దీర్ఘ దృష్టి లోపాల నవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు విధానం, విద్యుత్ మోటార్, ఏసీ జనరేటర్, డీసీ జనరేటర్ పని చేసే విధానం, క్వాంటమ్ సంఖ్యలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం, ఆమ్లాలు, లవణాలు, కాంతి పరావర్తనం, వక్రీభవనం అడిగే దానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. జవాబులు రాసేటపుడు క్రమ పద్ధతి పాటించాలి. ప్రశ్నల క్రమ సంఖ్య మార్జిన్ బయట వేసి అర్థమయ్యేలా రాస్తే పూర్తి 50 మార్కులు సాధించవచ్చు.

– పి. రాజారావు, ఫిజికల్ సైన్స్, గంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్

పటిష్ట ప్రణాళికతో.. మార్కులు పదిలం

విద్యార్థి భవిష్యత్తును మలుపు తిప్పేది పదో తరగతి. మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల ఇళ్లకెళ్లి మరీ వారికి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. బాగా చదివేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మార్కులు 'పది'లం అయ్యేలా తీర్చిదిద్దుతున్నారు.

– పెదగంట్యాడ

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధం

ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు

రివిజన్‌లో బిజీబిజీ



నైట్ విజిట్‌లో విద్యార్థి చదువుపై ఆరా తీస్తున్న నడుపూరు పాఠశాల ఉపాధ్యాయిని

ఆయా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు ఎలా సన్నద్ధం కావాలో సబ్జెక్టు ఉపాధ్యాయుల సూచనలు ఇలా...



ప్రత్యేక తరగతుల్లో నడుపూరు పాఠశాల విద్యార్థులు

నూరు శాతం ఫలితాలే లక్ష్యం



నూరు శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ప్రశ్నపత్రాన్ని ఒకటికి రెండు సార్లు అర్థమయ్యే విధంగా చదువుకోవాలి. బట్టీ పట్టే విధంగా కాకుండా సమాచార నైపుణ్యం. సామర్థ్యం పై ఇచ్చిన పట్టికలు, గ్రాఫ్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మ్యాప్ పాయింటింగ్, బిట్స్ ఒక మార్కు ప్రశ్నలపై ప్రత్యేక దృష్టి పెడితే సులభంగా పదికి పది పాయింట్లు సాధించవచ్చు. బిట్ పేపర్‌లో జవాబులు, తప్పులు కొట్టివేతలు లేకుండా చేయాలి..

–జి.ప్రమీల, ప్రధానోపాధ్యాయురాలు, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

హిందీలో..



పాఠ్యపుస్తకం కొత్తది.. ప్రశ్న పత్రంలో మొత్తం ఆరు భాగాలు ఉంటాయి. ఇందులో భాషాకిబాత్, అర్థ్ గ్రాహ్యత, ప్రతిక్రియ, కవుల జీవిత చరిత్ర, ఉప వాచకం, పద్య, గద్య భాగం, అపర విభాగం ఉంటాయి. మొదటి భాగంలో 12 ప్రశ్నలు వ్యాకరణానికి సంబంధించినవి కాగా సరళమైన వ్యాకరణాలు నేర్చుకొని పట్టిక తయారు చేసుకోవాలి. 2వ భాగం ప్రశ్నల్లోని కీలక పదాన్ని ప్యాసేజీలో వెతికి సమాధానం గుర్తించవచ్చు. 3వ భాగం కవి పరిచయాల్లో కబీర్‌దాస్, మీరాబాయి నేర్చుకుంటే సరిపోతుంది. 4వ భాగంలో 8 ప్రశ్నల్లో ఆరింటికి సమాధానాలు నాలుగు వాక్యాల్లో రాయాలి. ఒక వ్యాసాన్ని ఉప శీర్షికతో పది వాక్యాలకు తగ్గకుండా రాయాలి. మల్టీపుల్ చాయిస్ ప్రశ్నలను మొదట బాగా చదివి తర్వాత సమాధానం గుర్తించాలి. చేతి రాత బాగుండాలి, వ్యాకరణ దోషరహిత వాక్య నిర్మాణంతో జవాబు రాయాలి. ఇలా చేస్తే మంచి మార్కులు మీ సొంతం.

–పి. నారాయణరావు, హిందీ, నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్

గణితంలో ప్రాక్టీస్ చాలా ముఖ్యం



గణితంలో పూర్తి మార్కులు సాధించడానికి ప్రాక్టీస్ చాలా ముఖ్యం. చాలా మంది గణితం అంటే భయపడతారు. సూత్రాలు, త్రిభుజాలను బాగా నేర్చుకోవాలి. అంక మధ్యం, మధ్యగతం,బాహుళకంను బాగా సాధన చేస్తే సులభంగా మంచి స్కోర్ వస్తుంది. గణిత పుస్తకంలో ఉండే 14 చాప్టర్ల నుంచి 8 లేక 9 చాప్టర్లను సింపుల్ పద్ధతిలో రివిజన్ చేయడం శ్రేయస్కరం. వాస్తవ సంఖ్యలు, బహుపదులు రెండు చరరాసులలో రేఖీయ సమీకరణాలు, జత, నిరూపక, జ్యామితి, త్రికోణం అనువర్తనాలు, వృత్తాలు, సమన్విత వైశాల్యాలు, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత ఈ తొమ్మిది అధ్యాయనాల నుంచే మంచి మార్కులు వస్తాయి. సులువుగా ఉన్న ప్రశ్నలను ముందుగా చేయాలి. దీంతో మనోధైర్యం లభిస్తుంది.

–కె ప్రసన్న, గణితం, గంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్

ఆంగ్లంపై అవగాహన అవసరం



ఆంగ్ల పరీక్ష ఒకే పేపర్‌పై 100 మార్కులకు ఉంటుంది. సెక్షన్-ఏ రీడింగ్, కాంప్రహెన్షన్, సెక్షన్ -సి క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్లకు ఒక్కో దానికి 30 చొప్పున 60 మార్కులు ఉంటాయి. సెక్షన్-బిలో వకాబులరీ, గ్రామర్ కలిపి 40 మార్కులు ఉంటాయి. వీటిని ఉపాధ్యాయుల సహాయంతో సందేహాలను నివృత్తి చేసుకుంటూ సాధన చేయాలి. కాంప్రహెన్షన్‌లో ముందుగా పేరాను ఒకటికి రెండు సార్లు బాగా చదవాలి. ప్రశ్నలోని కీలక పదం గుర్తించి వాటి ఆధారంగా పేరాలో జవాబును వెతికి రాయాలి. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రశ్నలను వరుసగా రాయడం.. ప్రశ్నల నెంబర్లను సరిగ్గా వేయడం, కొట్టి వేతలు లేకుండా చక్కటి చేతిరాత ముఖ్యం. క్రియేటివ్ రైటింగ్‌లో లెటర్, డైరీ, డైలాగ్, పేరాగ్రాఫ్, ప్రశ్నల రూపకల్పన డేటా అనాలసిస్ వర్ణన అంశాలకు సంబంధించి ప్రశ్నను చదివి అర్థం చేసుకొని సొంతంగా రాసే విధంగా సాధన చేస్తే విజయం మీదే.

– ఉల్లి అరుణ, ఇంగ్లిష్, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఇస్లాంపేట

క్లుప్తంగా

పేడాడకు 87వ వార్డు నాయకుల అభినందన



రమణకుమారిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన పేడాడ రమణకుమారిని సోమవారం 87వ వార్డు కణితికాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సత్కరించారు. రమణకుమారిని అభినందించిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, వార్డు నాయకులు ఎంవీ రమణ, బీసీ సెల్ కార్యదర్శి దుగ్గపు దానప్పలు, సీనియర్ నాయకుడు ప్రగడ శ్రీనివాస్, కేవీ నారాయణ, పూడి శ్రీను, ప్రగడ శంకరరావు, గున్న రామారావు, ఈశ్వరరావు, గుంట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులతో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్

అక్కిరెడ్డిపాలెం: నగరంలోని పోర్టు స్టేడియంలో ఆదివారం జరిగిన రెండవ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. కాటా విభాగంలో 9వ తరగతి విద్యార్థులు కె.ఏసుపాదం గోల్డ్ మెడల్, ఎస్. సంతోష్ ఒక గోల్డ్, ఒక సిల్వర్ మెడల్, ఎస్. మార్క్ రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు స్కూల్ పీడీ ఇస్మాయిల్ తెలిపారు. వీరంతా బ్రైట్ లైఫ్ హోమ్‌లో ఉంటున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం స్కూల్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కుమారస్వామి, బ్రైట్ లైఫ్ హోమ్ ఫౌండర్ డాక్టర్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సరకుల వితరణ



పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సర్వహిత ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డుకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పలువురికి ట్రస్ట్ తరపున పింఛన్లతో పాటు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పెదమడక బీసీ కాలనీకు చెందిన మూడు కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యంతో పాటు పప్పులు, పంచదార, నూనె, చింతపండు తదితర నిత్యావసర సరకులు ట్రస్ట్ మాజీ చైర్మన్ గంథోలి నరసింగరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి, కార్యదర్శి జామి గణేష్, ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, పట్టా రామఅప్పారావు, పి. కొండలరావు, కె. హనుమంతరావు, లక్కరాజు రాము, గంథోలి వెంకటరమణ, బి. ఈశ్వరరావు, పి. నరేష్, గంథోలి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంపే ధ్యేయంగా పనిచేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్.ఎం.ఎస్-2 విభాగాధిపతి జయకుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి పెంపే ధ్యేయంగా ఉద్యోగులంతా పనిచేయాలని స్టీల్‌ప్లాంట్ ఎస్.ఎం.ఎస్-2 విభాగాధిపతి బి. జయకుమార్ కోరారు. ఎస్.ఎం.ఎస్-2 నూతన విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం ఆయన్ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం సంఘం నాయకులు కలిసి అభినందించారు. జయకుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత కష్టాల్లో నుంచి బయటపడటానికి ఈ ఏడాది ఆరున్నర మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. తద్వారా ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బి. తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ, పుల్లారావు, మోహన్‌బాబు, సాయి ప్రసాద్, బి. అరవింద్, రవి, సువర్ణరాజు, ఎం.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు వసతులు కల్పించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న టిడ్కో గృహాల లబ్ధిదారులు, సీపీఐ నాయకులు

గాజువాక: టిడ్కో గృహ సముదాయంలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ లబ్ధిదారులు సోమవారం జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు తక్షణమే స్పందించకపోతే టిడ్కో గృహాల ప్రాంగణంలో రిలే నిరసనకు దిగుతామని హెచ్చరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గృహాలను లబ్ధిదారులకు అందజేసి ఏడాది దాటుతున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. మౌలిక వసతులు లేకపోవడం వల్ల లబ్ధిదారులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారన్నారు. వీటికితోడు టిడ్కో గృహాల కోసం మంజూరు చేసిన రుణాలకు ఈఎంఐలు కట్టుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో గృహ లబ్ధిదారులు ఇక్కట్ల పాలవుతున్నారన్నారు.

అనంతరం జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పెదపూడి దుర్గారావు, అప్పారి విష్ణుమూర్తి, టిడ్కో నివాసిత సంఘం నాయకులు అప్పలరాజు, వనజాక్షి, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



దుర్గవానిపాలెంలో చిన్నారులకు డీవార్మింగ్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ రమేష్

పెదగంట్యాడ: నులి పురుగుల నివారణతో విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెదగంట్యాడ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం దుర్గవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సంవత్సరంలో రెండు సార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో రమణాజీ, హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం హై స్కూల్‌లో మాత్రలు వేస్తున్న ఏఎన్‌ఎం మహాలక్ష్మి

డీ వార్మింగ్ మాత్రల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: నేషనల్ డీ వార్మింగ్ డే (ఎన్‌డీడీ)ను పురస్కరించుకొని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో విద్యార్థులకు డీ వార్మింగ్ (నులిపురుగుల నివారణ) మాత్రలు పంపిణీ చేశారు. అక్కిరెడ్డిపాలెం సచివాలయ ఏఎన్‌ఎం సీహెచ్.మహాలక్ష్మి విద్యార్థులకు మాత్రలను వేశారు. 413 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్, మలేరియా విభాగం సూపర్ వైజర్ కె.అప్పలరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ చైర్మన్‌కు సత్కారం



పీఎఫ్ ట్రస్ట్ చైర్మన్, కార్యదర్శులను సత్కరిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్ చైర్మన్ హెచ్.కె. ఝా, కార్యదర్శి సూరిశెట్టి రామ్ ప్రసాద్‌లను సోమవారం ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా సీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ సమస్య పరిష్కరించడంలో వీరు చేసిన కృషి ఎనలేనిదన్నారు. డిమాండ్ లెటర్లకు స్పందించి నగదు జమ చేసి 15 నెలలు అయినా పెన్షన్ రాని విషయాన్ని కేంద్ర కార్మిక మంత్రి, కార్మిక శాఖ కార్యదర్శి, సెంట్రల్ పీఎఫ్ ట్రస్ట్, ట్రస్టీలను నిరంతరం స్పందిస్తూ వాటికి తగిన ఆధారాలు సమర్పించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సుమారు 5500 మంది ఉక్కు ఉద్యోగులకు పెన్షన్ వచ్చే విధంగా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీ నాయకులు చంద్ర వెంకటేశ్వరరావు, పి. లోకేష్, ఎం. అప్పారావు, ఉమా సుందరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న నాంది ఫౌండేషన్ ప్రతినిధులు

పెదగంట్యాడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని నాంది ఫౌండేషన్ ప్రతినిధులు సైనాజ్, జరీనా అన్నారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నన్హి కలి అనే కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 204 మంది విద్యార్థులకు సోమవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలపై అవగాహన కల్పిస్తున్నామని, క్రీడల్లో రాణించిన వారికి బంగారు భవిష్యత్తు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సర్వారే ఆలం, కాకి శ్రీను, ఎండీ సాకీర్, పాఠశాల హెచ్‌ఎం ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు రాజు

పెదగంట్యాడ: జేఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో మొత్తం 30 మంది రోగులను పరీక్షించారు. అందులో పది మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జాగారపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బ్రష్ చేస్తూ సెక్యూరిటీ గార్డు మృతి



బుదిరెడ్డి దుర్గారావు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: విధుల ముగించుకుని ఇంటికి బయలు దేరాల్సిన సమయంలో బ్రష్ చేసుకుంటూ రక్తం కక్కుకుని సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. దీంతో సమాచారం అందుకున్న అతడి బంధువులు కంపెనీలో కొంత సేపు ఆందోళన చేశారు. ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గవరజగ్గయ్యపాలేనికి చెందిన బుదిరెడ్డి దుర్గారావు (47) ఆటోనగర్ ఈ – బ్లాక్‌లోని కనోయ్ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (స్టీల్‌ప్లాంట్‌కు చెందిన బొగ్గు ప్రాసెస్) కంపెనీలో 6 నెలల కిందట సెక్యూరిటీ గార్డుగా చేరాడు. సోమవారం ఉదయం 5 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి బయలు దేరే సమయంలో కంపెనీలోనే బ్రష్ చేసుకుంటుండగా ఒక్కసారిగా నోట్లో నుంచి రక్తం కక్కుకొని కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి సెక్యూరిటీ 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 దుర్గారావును పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. దుర్గారావు మృతిపై కంపెనీ యజమానికి సమాచారం అందించినా తాను ఊర్లో లేనని చెప్పడంతో మృతదేహం కంపెనీలోనే 6 గంటల వరకు ఉండిపోయింది. చివరకు మృతుడి బంధువుల సమాచారంతో దువ్వాడ ఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కంపెనీ యాజమాన్యం చివరకు రూ. 80 వేలు అందజేస్తామని అంగీకరించినట్లు మృతుని బంధువులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారన్నారు. సంఘటనపై ఫిర్యాదు చేయపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అధికారికి ఘనంగా వీడ్కోలు



గోపాల్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సహోద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో అధికారిగా విధులు నిర్వహిస్తూ ఎన్టీపీసీలో ఉద్యోగం పొందిన ఇనుస్ట్రుమెంటేషన్ విభాగం అధికారి గోపాల్ ప్రసాద్ భగత్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. విభాగంలో జరిగిన కార్యక్రమంలో సహ అధికారులు, కార్మికులు ఆయన్ను సత్కరించారు. వారు మాట్లాడుతూ గోపాల్ ప్రసాద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కనకరాజు, అన్నపరాజు, కిరణ్‌కుమార్, ఎల్లేటి శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, వెన్న శ్రీరామ్మూర్తి, కె. రామచంద్రరావు పాల్గొన్నారు.

మరో 177 హయ్యర్ పెన్షన్ డిమాండ్ లెటర్ల జారీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు చెందిన హయ్యర్ పెన్షన్‌కు సంబంధించి మరో 177 డిమాండ్ లెటర్లు జారీ అయ్యాయి. స్టీల్ ప్లాంట్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్ నిబంధనలు హయ్యర్ పెన్షన్‌కు అనుగుణంగా ఉన్నాయని ప్రావిడెంట్ ఫండ్ అధికారులు తెలిపిన తర్వాత మొదటసారి ఈనెల 7న స్టీల్‌ప్లాంట్‌కు చెందిన సుమారు 480 మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు డిమాండ్ నోటీసులు జారీ అయ్యాయి.

మరలా సోమవారం రెండో డిమాండ్ లెటర్లు జారీ కావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారంలోగా మిగిలిన అందరి ఉద్యోగులకు డిమాండ్ లెటర్లు అందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాను దర్శించుకొంటున్న భక్తులు

గాజువాక: స్థానిక హై స్కూల్ రోడ్‌లోని గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో షిర్డీసాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పాభిషేకాలు, అఖండ సాయినామ సంకీర్తన, మధ్యాహ్న హారతి, దూప్ హారతి నిర్వహించారు. అమ్ముల సాంబశివరావు నిర్వహించిన సత్సంగం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.